రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉయ్యూరు: విజయవాడ-గుడివాడ రహదారిపై కలవపాముల వద్ద శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు గాయాలపాలు కాగా, ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. సేకరించిన వివరాల ప్రకారం...ఉయ్యూరు మండలం కలవపాముల గ్రామానికి చెందిన గంటా రమేష్‌బాబు వెంట్రప్రగడ నుంచి బైక్‌పై ఇంటికి వస్తున్నాడు. కలవపాముల నుంచి గుడివాడ వైపు ట్రాక్టరు వస్తుండగా ట్రాక్టరు, బైక్ ఒకదాన్నొకటి ఢీకొన్నాయి. గుడివాడ వైపు నుంచి వస్తున్న మరో బైక్‌ను రమేష్‌బాబు ఢీకొన్నాడు. ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న పెడన వాసులు రావూరి వెంకటేశ్వరరావు, నాగరాజు గాయపడ్డారు. రమేష్‌బాబు కాలు విరిగిపోయింది. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉంది. తీవ్రంగా గాయపడ్డ రమేష్‌బాబును కలవపాముల సర్పంచ్ పానుగుమాటి బాలస్వామి 108లో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పెనమలూరు: గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలవటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈడుపుగల్లుకు చెందిన కలపాల సాంబశివరావు గంగూరు వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన అతను విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

నాడు-నేడు పనుల పరిశీలన

కంకిపాడు: పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయని ఏపీఈడబ్ల్యూఐడీసీ ఏఈ శ్రీనివాసరావు అన్నారు. కంకిపాడు జెడ్పీ పాఠశాలలో రూ.77 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన నాడు-నేడు పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్రాధాన్యతా క్రమంలో వసతుల కల్పన పనులు వేగంగా పూర్తి చేస్తున్నామని, వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభానికి భవనాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపడతామని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుధారాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వరుణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఉన్నత విద్యా మండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి

పెనమలూరు: విద్యార్థులు నైపుణ్యాన్ని ప్రదర్శించి అన్నిరంగాల్లో రాణించాలని ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి అన్నారు. పోరంకిలో శనివారం బ్లూమింగ్ డేల్ పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చిన్నారుల్లో సృజనాత్మకత పెంపొందించే విధంగా విద్యా విధానం ఉండాలన్నారు. నలంద విద్యా సంస్థల చైర్మన్ విజయబాబు మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు నైపుణ్యంతో పాటు క్రీడల్లో కూడా రాణించే విధంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేశారు.

సామాజిక తనిఖీలో బయటపడ్డ లోపాలు

- నాటిన మొక్కలు మాయం
- కూలీ చెల్లింపు రికార్డుల్లో తప్పులు

పెనమలూరు: మండల పరిధిలో జరిగిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి గ్రామీణ పథకంలో లోపాలు జరిగాయని సామాజిక తనిఖీ బహిరంగ సభలో వెల్లడైంది. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం 2021 ఏప్రిల్ నుంచి 2022 మార్చి వరకు పది గ్రామాల్లో జరిగిన ఉపాధి పథకం పనులపై ప్రిసైడింగ్ అధికారి పి.రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ప్రజావేదిక జరిగింది. చోడవరం, గంగూరు, పెదపులిపాక గ్రామాల్లో నాటిన దాదాపు వెయ్యి మొక్కలు ఐడీ నంబర్ ప్రకారం లేవని, మొక్కలు కనబడటం లేదని తేల్చారు. పెదపులిపాక గ్రామంలో జరిగిన పనుల రికార్డులు దిద్దుబాటు జరిగినట్లు గుర్తించారు. ఉపాధి కూలీల చెల్లింపుల్లో కూడా లోపాలు ఉన్నట్లు తనిఖీ అధికారులు గుర్తించి రికవరీకి ఆదేశించారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి వి.విజయలక్ష్మి, ఎంపీడీఓ సునితాశర్మ, క్లస్టర్ అధికారి నాంచారరావు, ఆడిట్ స్టేట్ రిసోర్స్‌పర్సన్స్, సర్పంచిలు కాకర్ల వెంకటరత్నం, శ్రీనివాసచౌదరి, సంగెపు శ్రీనివాసరావు, లింగాల భాస్కరరావు పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కంకిపాడు: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను ప్రజోపయోగార్థం ఉండేలా చేపట్టాలన్నారు. నిధుల వినియోగంలో లోటుపాట్లు తలెత్తకుండా చూడాలన్నారు. 2021-22 సంవత్సరానికి గానూ మండలంలోని వివిధ గ్రామాల్లో రూ 8.23కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టామని, సంబంధిత పనులపై సామాజిక తనిఖీ నిర్వహించి ప్రజావేదికలో వివరాలను వెల్లడించినట్లు ఏపీఓ బసవరాజు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, ఏపీడీ ఎస్.వి.నాంచారరావు, ప్రిసైడింగ్ అధికారి పి.రామమోహన్‌రా వు, ఎంపీడీఓ కె.దుర్గాప్రసాద్, జేఈ నాగరాజు, టీఏ రామారావు, ఎస్ఆర్‌పీ వెంకటరమణ పాల్గొన్నారు.



కూలీ డబ్బులు అందజేస్తున్న ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి

కరాటేలో పలువురికి పతకాల పంట

పెనమలూరు: మండల పరిధిలోని క్రీడాకారులు పలువురు కరాటే పోటీల్లో పతకాలు సాధించారు. బ్రహ్మ ఫుటోరియో కరాటే అకాడమీ కోచ్ ఉప్పాడ విజయ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. గత నెల 29, 30 తేదీలలో గోవాలో జరిగిన ఆసియా కరాటే పోటీల్లో అండర్ 10 కాటా విభాగంలో జి.బి.వి.అభిలాష్‌కు గోల్డు మెడల్, అండర్ 11 కాటా విభాగంలో ఎస్.విజయ హాసినినాయుడు గోల్డు మెడల్, బి.శ్రీలత బ్రాంజ్ మెడల్, అండర్ 12 కాటా విభాగంలో ఎ.విజయ్‌కుమార్ గోల్డు, ఎం.అభినవ్ బ్రాంజ్, అండర్ 13 కాటా విభాగంలో సాయిచంద్ గోల్డు, అండర్ 14 కాటా విభాగంలో ఆర్.యువసిజిత్‌బాబు గోల్డు, కె.రణధీర్ సిల్వర్, అండర్ 15 కాటా టి.రేణుశ్రీ గోల్డు, కె.కౌశ్వవి సిల్వర్ గెలిచారన్నారు.అండర్ 16లో బి.తన్విత్ గోల్డు, అండర్ 15లో కుమితి 45 కిలోల విభాగంలో టి.రేణుశ్రీ గోల్డుమెడల్ గెలిచారన్నారు. విజేతలను గ్రాండ్‌మాస్టర్ బ్రహ్మానందం అభినందించారు.



కరాటే పోటీలో గెలుపొందిన క్రీడాకారులు

కానూరులో విజేత సూపర్ మార్కెట్ ప్రారంభం

పెనమలూరు: కానూరు అశోక్‌నగర్‌లో శనివారం విజేత సూపర్‌మార్కెట్‌ను నూతనంగా ప్రారంభించారు. గత 24 సంవత్సరాలుగా ఏపీ, తెలంగాణలో వినియోగదారులకు అత్యున్నత సేవలు అందిస్తున్న తాము తమ సేవలను తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో విస్తరించామని విజేత సూపర్‌మార్కెట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురుకొండ సందీప్‌చౌదరి తెలిపారు. తమకు అండగా నిలిచిన ఖాతాదారులకు, డిస్ట్రిబ్యూటర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



సూపర్‌మార్కెట్‌ను ప్రారంభిస్తున్న సందీప్‌చౌదరి

సంక్షిప్త వార్తలు

అక్రమ నిర్మాణం తొలగింపు

పెనమలూరు: తాడిగడప గ్రీన్‌సిటీ వద్ద అనుమతులు లేకుండా నిర్మాణం చేసిన గోడ, రోడ్డును తొలగించామని మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు తెలిపారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు, లేఅవుట్‌లు వేయరాదని హెచ్చరించారు.

20 మందికి వైద్య పరీక్షలు

రామవరప్పాడు: గూడవల్లి ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో శనివారం సచివాలయం-1లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వై ద్యాధికారి కె.సునీత కీళ్లవాతం, గ్యాస్ట్రబుల్, దగ్గు, జలుబు, చర్మవ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి 20 మందికి ఉచితంగా మందులు అందజేశారు.

గర్భిణికి ఆర్థిక సాయం

గన్నవరం: మండలంలోని బీబీ గూడెం గ్రామానికి చెందిన గర్భిణి చిట్టిపోతుల ఇందుజా వైద్యచికిత్సల నిమిత్తం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.8 వేల సాయం చేశారు. స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో శనివారం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పడమట సురేష్, అల్లాపురం సర్పంచి డొక్కు వెంకన్నబాబు చేతుల మీదుగా ఆమెకు నగదును అందజేశారు.

ఆరోగ్యానికి పౌష్టికాహారం అవసరం

పెనమలూరు: పౌష్టికాహారం తీసుకోవటం వలన ఆరోగ్యకరంగా జీవించవచ్చని సీడీపీవో కె.బేబిసుకన్య అన్నారు. పెనమలూరు సెక్టార్‌లో శనివారం పోషణ్ పక్వాడ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ విజయ, పెనమలూరు,తాడిగడప, చోడవరం అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. గంగూరు-4 అంగన్‌వాడీలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అక్బర్‌బాషా పాల్గొన్నారు.

రూ.37.77 లక్షల లాభం ఆర్జించిన తిప్పనగుంట పీఏసీఎస్

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం తిప్పనగుంటలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.17 కోట్ల టర్నోవర్ సాధించినట్లు సొసైటీ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ శనివారం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో సొసైటీలో 77 మంది రైతులకు రూ.3.23 కోట్ల రుణాలు మంజూరు చేశామని పేర్కొన్నారు. సొసైటీ రూ.37.77 లక్షల మేర లాభం ఆర్జించిందని పేర్కొన్నారు.

పేద విద్యార్థికి సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరురోడ్డు గణపతి కాంప్లెక్స్‌లోని మానవత కార్యాలయంలో శనివారం బీబీఏ మూడో సంవత్సరం చదువుతున్న దండమూడి అశ్వంత్ చౌదరికి రూ.15 వేలు సాయాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అందించారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖ అధ్యక్షుడు చక్కా సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రభాకరరావు శనివారం తెలిపారు. అంపాపురం, ఆరుగొలను, కోడూరుపాడు, వీరవల్లి గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున, బాపులపాడులో 6, వీరవల్లిలో 5 పోస్టులు భర్తీని నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణకు ఈ నెల 4వ తేదీ తుది గడువుగా తెలిపారు. దరఖాస్తుదారులకు 11వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పదో తరగతి పరీక్షలకు 1,149 మంది విద్యార్థులు

గన్నవరం రూరల్: ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు గన్నవరం జెడ్పీ బాయ్స్ నుంచి 215, గరల్స్ హైస్కూల్ నుంచి 184 మంది, దావాజీగూడెం 175, ఎల్ఎల్ఎఫ్ఈ హైస్కూల్ నుంచి 150, ముస్తాబాద 135, గొల్లనపల్లి 145, వీరపనేనిగూడెం 145 మంది చొప్పున మొత్తం 1,149 విద్యార్థులు హాజరవుతారని ఎంఈఓ బి.శ్రీనివాస్ తెలిపారు. వీరితోపాటు ప్రైవేటుగా సబ్జెక్టులు రాసే విద్యార్థులు ఉంటారని పేర్కొన్నారు.

పౌష్టికాహార పక్షోత్సవాలు

ఉయ్యూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని సాయిమహల్ సెంటరులో పౌష్టికాహార పక్షోత్సవాలు శనివారం నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉయ్యూరు మూడవ వార్డు కౌన్సిలర్ తెనాలి పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబి సరోజిని, ఉష, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు, సామగ్రి పంపిణీ

కంకిపాడు: క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఎస్ఐ కె.సుధాకర్ ఆకాంక్షించారు. మండలంలోని మద్దూరు గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు వితరణతో స్థానిక జెడ్పీ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు అవసరమైన పరీక్ష ప్యాడ్‌లు, పరీక్ష సామగ్రిని శనివారం ఎస్ఐ సుధాకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు, కాసరనేనివారిపాలెం సర్పంచ్ పి.వరప్రసాద్, హెచ్ఎం ఎ.ఉమాదేవి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఉయ్యూరు: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తహసీల్దార్ మస్తాన్ తెలిపారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ పదో తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ఉయ్యూరు మండలంలో ఏడు పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పరీక్ష కేంద్రానికి 200 మీటర్ల లోపు ఎలాంటి నెట్, జిరాక్స్ సెంటర్లు తెరవరాదన్నారు. ఏ నలుగురు వ్యక్తులు గుమిగూడినా 144 సెక్షన్ ప్రకారం చర్యలు ఉంటాయని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

బీఎస్‌పీ అవార్డుల పోస్టర్ ఆవిష్కరణ

ఉయ్యూరు: బహుజన సాహిత్య అకాడమీ అవార్డుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బీఎస్‌ఏ అవార్డుల పోస్టర్‌ను శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు, బీసీ ఉద్యమకర్త ఆర్.కృష్ణయ్య హాజరయ్యే అవార్డుల సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు. బీఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ పట్టణంలోని గ్రీన్‌ల్యాండ్ ప్రాంగణంలో ఈనెల 14న బీఎస్‌ఏ అవార్డుల ప్రదానోత్సవం, అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు, కౌన్సిలర్ డాక్టర్ జంపాన పూర్ణిమ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన గార్డు మృతి

పెనమలూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న సెక్యూరిటీ గార్డు మృతి చెందటంతో పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం పెదపులిపాక గణపతినగర్‌లో ఉంటున్న బట్టు బాలశౌరి (67) సెక్యూరిటీ గార్డుగా పని చేస్తాడు. అతను శుక్రవారం రాత్రి బైక్‌పై డ్యూటీకి ఇంటి నుంచి బయలుదేరి అవనిగడ్డ కరకట్టపై వెళుతుండగా యనమలకుదురు వద్ద ఎదురుగా వచ్చిన సైక్లిస్టు బైక్‌కు తగలటంతో బాలశౌరి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డాడు.అతనిని విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు శామ్యూల్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్తమ వలంటీర్‌గా రాజేష్

రామవరప్పాడు: ఉత్తమ వలంటీర్‌గా నిడమానూరుకు చెందిన పెనుమాక రాజేష్ కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆపదమిత్ర వలంటరీ ట్రెనింగ్ ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కళాశాలలో ఇటీవల నిర్వహించారు. ఈ శిక్షణలో రాజేష్ ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. రాజేష్‌ను శనివారం సర్పంచ్ శీలం రంగారావుతో పాటు పలువురు అభినందించారు.

పాఠశాలల అభివృద్ధికి రోటరీ సహకారం

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెం ఎంపీపీ పాఠశాలలో రోటరీక్లబ్ ఆఫ్ అమరావతి ఆర్థిక సౌజన్యంతో రూ.60 వేలు విలువైన లంచ్ టేబుల్స్, ఫ్యాన్లు, గ్రిల్‌ను ఏర్పాటు చేశారు. వీటిని రోటరీక్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వి.భాస్కర్‌రామ్ శనివారం ప్రారంభించారు.

